


# పొగచూరిన బ్రతుకు

**కు**ర్చీ కిటికీ దగ్గిరకు లాక్కుని శూన్యంగా ఆకాశంకేసి చూస్తూ కూర్చున్నాను.

ఎక్కడా నక్షత్రమైనా కనిపించడంలేదు.

నల్లటి కారుమబ్బు ఆకాశమంతటా పరుచుకుపోయింది.

వాన కురుస్తుందేమో అనిపించింది. అయినా ఎక్కడా మేఘాల కదలికే వున్నట్టులేదు.

గాలి అలికిడి కూడా లేకుండా పోయింది.

దొడ్లో వున్న కొబ్బరిచెట్లూ, దూరంగావున్న తాటిచెట్లూ అన్నీ పొగచూరిన గోడ మీది బొగ్గు గీతల్లా కనబడుతున్నయ్.

ప్రకృతి అంతా నిర్జీవిలా, నిశ్చలంగా వుండిపోయింది.

నేను శూన్యంగా చూస్తూ, నిర్జీవిలా అలా వుండిపోయాను.

ఆ స్థితిలోవున్న నన్ను ఎవరో చూసి ఆ మాటలంటున్నట్టు నా మనస్సుకు అనిపించింది.

గడియారం ఖంగుమనే ధ్వనితో పన్నెండు గంటలు కొట్టింది.

నేను దృష్టిని అటు తిప్పి కాలానికి సెకండ్లు, నిమిషాల విలువా, ఆకృతీ యిస్తున్న – ఆ కదిలే

లోహప్రాణికేసి చూస్తున్నాను.

నిమిషం గడిచింది. హఠాత్తుగా అప్పుడు స్ఫురించింది – నాకు యిరవై ఆరో యేడు ప్రవేశించి అప్పుడే నిమిషం అయిపోయిందని.

వయసూ, ఆనందం, జీవితం, వాట్ల విలువా – వీటన్నిటిని గురించి ఏనాడూ నేను ఆలోచించి ఎరగను.

కాని, చుట్టపు చూపుగా వచ్చి అత్త – ఈ భావాలన్నీ నాలో పాదుకొల్పి ప్రజ్వరిల్లచేసి వెళ్ళి పోయింది.

“లంకంత యిల్లు! ఒక్కతెవూ, ఎలా జీవితం గడుపుతావు? వయసూ, ఆనందం…” – ఇలా ప్రారంభించేది అత్త.

ఈ మాటల్ని మొదట్లో నవ్వులాట కిందే తోసేశాను. అంతా వయసు మళ్ళిన మేనత్త ఆలాపనగా, ప్రేలాపనగా కనబడింది.

“ఈ లంకంత యింటికి రావణుడు లేడనేనా నీ గోల!” – అని కూడా అన్నాను.

కాని తరవాత ఆలోచించి చూస్తే అవన్నీ తొందరపాటు మాటలేమో అని కూడా అనిపించింది. అయినా మరికాస్త తరిచి చూస్తే – లంకంత యిల్లు వుంది గదా అని ఏ రావణుడినో ప్రవేశపెట్టక పోవడం మంచికేనేమో అనిపిస్తుంది.

నా పదో ఏటనే అమ్మపోయిం తరవాత, నాన్నా, నేనూ యీ యింట్లో యెంతో ప్రశాంతంగా బ్రతికాం.

నాన్నలో వున్న శాంతం, దయా, సానుభూతుల్లాంటివి నన్ను వివాహం ఆడేందుకు తయారైన నలుగురైదుగురు పురుషుల్లో ఏ ఒక్కడిలోనైనా వుంటుందేమో అని చూశాను. ఉహుఁ అలాంటిదేమీ లేదు. లాభనష్టాల దృక్పథం నుంచి చూస్తూ శరీరాన్ని కొనుక్కుందామనుకునే ధోరణీ, సమాధుల్ని తవ్వి పుర్రెలు అమ్ముకునే తత్వం వాళ్లల్లో నాకు ద్యోతకమయింది.

ఈ అనుభవాల తరువాతనే నాలో నాన్న అంటే – బ్రతికున్నప్పటి కంటే చనిపోయిన తరువాతనే ఎక్కువ మక్కువా, ప్రేమా వృద్ధి కాసాగింది.

నాన్న వట్టి పిరికిపంద అని ఈ వూళ్లో చాలామంది అనుకునేవాళ్ళు. అలా అని వాళ్ళంతా ఎందుకు భావించేవారో నాకు తెలుసు.

నాన్న పోయింతరువాత ఈ పదేళ్ళలో వూరు చాలా పెరిగింది. యిడ్లి పాత్రా, అట్ల పెనంతో వచ్చిన సుబ్బారాయుడు లక్షాధికారై, వడ్ల మరలు కూడా కొన్నాడు. యాభైలూ, వందలూ ఎకరాల ఆసామీలైన శఖునం వాళ్ల పిల్లలు కిల్లీకొట్లూ, సైకిల్ రిపేరింగ్ షాపులూ పెట్టుకుంటున్నారు. కాలం మారింది. దానితోపాటు నాకు అంతగా అర్థంకాని ఆర్థిక సంబంధాలూ మారినై. లోగడ డబ్బుంటే పొలాలు కొనేవాళ్ళంతా, ఇప్పుడు యిళ్లు కొని వ్యాపారాలు పెట్టి వేలు గడిస్తున్నారు.

సకలయ్య ఆ రోజుల్లో వట్టి తాగుబోతు. యానాది, ఎరికల వాళ్ళకి నాలుగులూ ఐదులూ వడ్డీకి అప్పులిచ్చి, యిష్టం వచ్చినట్టు తాగి రోడ్లంట బూతులు తిట్టుకొంటూ తిరిగేవాడు. ఈ

సకలయ్య నుంచే నాన్నకు ఈ వూళ్ళో పిరికిపంద అనే పేరు శాశ్వతంగా వుండిపోయింది.

ఆ రోజు వూరంతా హడావిడిగా వుంది.

పెద్దేటమ్మ జాతర పెద్ద ఎత్తులో చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నయ్. గుడి ముందు వున్న పెద్ద వేపచెట్టు కింద రాతిచప్టా మీద కూర్చుని తాగిన మైకంలో నానా హంగామా చేస్తున్నాడు సకలయ్య. నాన్న పొలం నుంచి వస్తున్నాడు.

"ఏహేయ్, ఎవడోస్ నాయాల్డి ఆ ఎల్లేది?" అంటూ కవ్వింపుకు వుపక్రమించాడు సకలయ్య.

"నేనోయ్ సకలయ్యా!" - అన్నాడు నాన్న శాంతంగా.

"బొడ్డుకోసి పేరు పెట్టినట్టు కూస్తుండావే! ఆఁ" - అంటూ సకలయ్య నాన్నని సమీపించి లాగి చెంప మీద ఓ దెబ్బ కొట్టాడు.

నాన్న చేతులో కర్ర కూడా వుంది - వస్తుతః ఆ వయసుకు తగ్గ బలం వున్న మనిషి కూడా.

కాని, నాన్న సకలయ్యని ఏమీ అనలేదు. చేజారిపోయిన కర్రను తీరుగా తీసుకుని సరాసరి ఇంటి కొచ్చేశాడు. సకలయ్య అలా నాన్నను కొట్టడం అక్కడ గుడి ముందు గుమిగూడిన చాలామంది చూశారు.

నాన్న ఇంటికి వచ్చేటప్పటికే అమ్మకు ఈ వార్త తెలిసింది.

"సకలయ్య చెంప మీద కొడితే, దేబి ముఖంవేసి వూరుకున్నావట - ఎందుకని?" - అని అడిగింది అమ్మ, కోపంతో ముక్కుపుటాలు ఎగరేస్తూ.

"అతడో తాగుబోతు!" - అన్నాడు నాన్న ముక్తసరిగా.

"నువ్వు మగవాడివే గదా...."

ఆ మాట వింటూనే నాన్న అమ్మ కేసి చూసిన చూపు ఈనాటికీ నా మనోఫలకం మీద ముద్రించుకునే వున్నది. అద్దంలా నున్నగా వుండే నాన్న ఫాలభాగం ఒక్కసారిగా దుక్కిచేనులా బీటలువారి పోయింది. ఆ కళ్ళల్లో కోపాని కన్న, బాధా, జాలీ ఎక్కువ పాళ్ళల్లో వున్నట్టు తోచింది.

అంతా ఒక్క క్షణికంలో జరిగిపోయింది.

అమ్మ మూర్ఛపోయిన దానిలా నాన్న కాళ్ళ మీద అలా వాలిపోయింది.

నాన్న మాట్లాడలేదు. ముంగురులు సవిరిస్తూ అమ్మను చేతుల్లోకి తీసుకుని నవ్వుతూ కళ్ళల్లోకి చూశాడు.

అంతే! ఆ రోజునా, తరువాత అమ్మ చనిపోయేవరకు ఆ ప్రసక్తే మా యింట్లో రాలేదు.

"మీ నాన్న దేవుడమ్మా. అందరూ అర్థంచేసుకోలేరు..." అంటూ ఏమో చెప్పబోయి దగ్గుత్తికతో ఆగిపోయేది అమ్మ.

ఏది ఎట్లా అయిపోతేనేం, నాన్నకు మాత్రం వూళ్ళో గౌరవం లేకుండా పోయింది. పిరికి బైతు, అదురు గుండెగాడు అంటూండేవాళ్లు అందరూ. ఆ చిన్న వయసులో నేనూ, నాన్నని అందరితో పాటు చిన్నచూపు చూశాను. నేను పెద్దదాన్ని అయింతరవాత నాన్నకూ, కుటుంబానికి వచ్చిన ఈ చెడ్డ పేరును రూపుమాపాలనుకునేదాన్ని. సకలయ్యని పట్టుకుని ఎడాపెడా బాదితీరతాను

అని శపథం కూడా చేశాను.

కాని, నాన్న పిరికివాడు కాదు అనేది రెండు సంవత్సరాల తరువాత నాకు బాగా అర్థం అయిపోయింది. అప్పటికి అమ్మ చనిపోయింది.

ఒకనాటి రాత్రి నేను ఇక్కడే ఈ కిటికీకి దగ్గిరగా మంచం వేసుకుని నిదరపోతున్నాను. నాన్న నడవలో పడుకున్నాడు. నా గది తలుపులు బార్లా తెరిచే వుంచాను.

బాగా అర్థరాత్రి అయివుంటుంది. మైమరచి నిద్రిస్తున్న నాకు హఠాత్తుగా ఎవరో హెచ్చు స్థాయిలో సంభాషిస్తున్నట్టు మాటలు వినబడినై. లేచి మంచం మీద కూర్చున్నాను. నడవలోంచి పెద్దగానే మాట్లాడుతూన్న ధ్వని వస్తోంది.

"పెట్టె, బేడా అట్లా కిందూ మీదూ చెయ్యవాక. మా అమ్మాయ్ వింటే భయపడుతుంది" – అంటున్నాడు నాన్న.

"ఎహెఁ! నోరుమూసుకోస్! కత్తి చూశావా?" – అంటున్నది ఏదో ఒక కొత్త గొంతు.

నేను భీతితో దుప్పటి నిండా కప్పుకుని పడుకున్నాను. నాన్నని వాడెవడో – బహుశా దొంగే అయివుంటాడు – కత్తి చూపెట్టి భయపెడుతున్నాడని నాకు తెలుస్తూనే వుంది.

మళ్ళీ క్షణం గడిచేసరికి పెట్టెలు అటూ ఇటూ దొర్లిస్తున్న శబ్దం వినబడింది.

"ఒరే బాబూ! చెప్పానుగదా – ఎందుకూ అంత తొందరా, విసుగూ నీకు? నేనేం చేయను. మంచం మీద యిలానే కూర్చుంటాను" అంటున్నాడు నాన్న.

"ఏం చేయవా? ఈ కత్తి సూసి నీ గుండె బేజారైందిగామాల! కదిల్తివా, హ్వాఁ!"

నాన్నని ఆ దొంగాడు కత్తితో పొడుస్తాడేమో అనిపించింది నాకు. ఆ నిమిషంలో నాకు ఎక్కడలేని ధైర్యం కలిగింది. సకలయ్యతో చెంపపెట్టు తిన్ననాడు అమ్మ నాన్న కేసి ఎలా చూసిందో – అలా చూస్తూ నా పక్కనే అమ్మ నిలబడివున్నట్టు భ్రాంతి కలిగింది. దుప్పటి తన్నేసి చకచక నడిచి తలుపు దగ్గరకు వెళ్ళాను.

మొట్టమొదటగా నాన్నే నన్ను చూశాడు. మంచం మీద కూర్చుని యేమీ జరగనట్టే ప్రశాంతంగా చుట్ట కాలుస్తున్నాడు.

నన్ను చూస్తూనే – "రామ్మా, రా! ఏం నిద్రపోలేకపోయావా?" – అన్నాడు నవ్వుతూ.

నేను దృష్టిని నాన్న మీంచి ఆ దొంగ వైపుకు తిప్పాను. కూర్చుని పెట్టెలో వున్న సామానంతా బయటికి విసిరేస్తున్నవాడల్లా నన్ను చూస్తూనే పక్కన పెట్టిన కత్తిని చేతికి తీసుకున్నాడు.

"ఎవర్నువ్వు? ఏంటి కమామిసూ!" – అన్నాడు దొంగ నాకేసి కోపంగా చూస్తూ.

వాడి మాటలు నాకేమీ భయాన్ని కలిగించలేదు. నేను పుట్టిపెరిగిన నా ఇంట్లో నన్నే 'ఎవర్నువ్వు?' – అని అడిగేవాడి తల బిరుసుతనానికి కోపం వచ్చింది. కళ్ళు వాడి మీంచి పక్కకు తిప్పుకోలేక పోయాను.

దొంగంటే నిజంగా వీడు నూటికి నూరు పాళ్ళ దొంగ అనిపించింది. 'కనకతార' – నాటకం రామాలయం దగ్గిర వేసినప్పుడు చూశాను. అందులో 'సూడే నా ఎంకా...' – అని పాడే దొంగాణ్ణి

చూస్తే భయం కన్న, నవ్వే కలుగుతుంది.

ఈ దొంగాడూ అచ్చగా అలాగే వున్నాడు. నల్లగా మసిగుడ్డలాంటి చాలీచాలని పంచా, మెళ్ళో వేళ్ళాడుతున్న రాగి పులిగోరు తాడూ, చింపిరి వుంగరాల జుట్టూ, సూదిమొనల్లా పదునుగా మెలితిరిగిన జల్లి మీసాలూ, వేటాడబడుతున్న క్రూరమృగంలా భయంతోపాటు కోపంగా చూసే చూపు –

నేను నవ్వాను.

"ఏంటి నవ్వుద్ది? ఆఁ!" – అన్నాడు దొంగ నాన్నకేసి చూస్తూ.

"నిన్ను చూస్తే నవ్వొచ్చుంటుంది!" – అన్నాడు నాన్న, తనూ నవ్వుతూ.

"నే నెవణ్ణనుకున్నారు? నాలుగు కూనీలు చేశాను. నాలుగు వందల దొంగతనాలు చేశాను. కత్తి చూశావా?" – అంటూ చేతిలోని కత్తిని అటూ ఇటూ తిప్పాడు దొంగ.

కత్తిని చూసేసరికి నాక కాస్త భయం వేసింది.

నాన్న మాత్రం అల్లరిచేసే చిన్న పిల్లల్ని కోప్పడుతూన్న గొంతుతో –

"ఏ మిత్తి నీ నెత్తిన కూర్చుని ఇన్ని పాపపు పనులు చేయించిందిరా బాబూ!" అన్నాడు.

"నన్ను వుడికించ్చకయ్యో!" అన్నాడు దొంగ.

'ఓస్–ఆస్' అనే ధోరణి మాని ఇలా అన్నందుకు దొంగ మీద నా కదోలాంటి గౌరవ భావం కలిగింది. వాడికీ నాన్న మీద కాస్త గౌరవ భావం ఏర్పడిందనుకున్నాను.

"నిన్నేమీ చెయ్యను. నీ పని ముగించుకుని వెళ్ళరా బాబూ, నిదరొస్తోంది" – అన్నాడు నాన్న ఆవలిస్తూ.

"పని ముగిచ్చేదేంటి? ఒక్క పంచ పనికొచ్చేది లేదు. చొక్కాలన్నీ చింపిరి పేలికలు. నాయాల్ది... కొంప..." – అంటూ పెట్టెల దగ్గిర నుంచి లేచి, బిందెలూ, చెంబులూ సర్దివున్న మూలకు వెళ్ళాడు.

నాన్న దొంగ మీదనే దృష్టిని కేంద్రీకరించి చూస్తున్నాడు.

నేను మంచం మీద నాన్న పక్కన కూర్చున్నాను.

దొంగ చెంబుల్నీ, కంచాల్నీ అటూ ఇటూ కాళ్లతో నెట్టి – వాటి పక్కనే వున్న రెండుమూడు నికిల్ గ్లాసుల్ని చేతికి తీసుకున్నాడు.

వాటిని ఎత్తుకుపోతాడేమో అన్న భయం కలిగింది నాకు.

గ్లాసుల్ని రెండు చేతుల్తో అటూ ఇటూ తిప్పిచూసి – "అన్నీ దొంగెండి గళాసులు! కొంపంతా చింపిరి గుడ్డలూ, చత్త సామానూ. ధూత్!" – అంటూ గ్లాసుల్ని కిందపడేశాడు దొంగ.

ఆ దొంగ మాటకు ముందు 'కొంప... చింపిరి గుడ్డలు' – అని వాగడం నాకు చాలా అవమా నకరంగా తోచింది. మా యింట్లో కనీసం దొంగాడికి పనికి వచ్చే వస్తువే లేదా? అని కోపం కూడా కలిగింది. 'ఫలాని చంచెయ్యగారింట్లో దొంగ పడితే – వాడికి దొంగలించేందుకు వస్తువే కనబడలేదట!' – అని రేపట్నుంచి వూళ్ళో వింతగా చెప్పుకుంటారు. అంతకన్న అవమానం

ఏముంటుంది? అనిపించింది నాకు ఆ సమయంలో.

మంచం మీంచి నాన్నతో ఏమీ చెప్పకుండా లేచాను.

నాన్న నాకేసి ఆశ్చర్యంగా చూశాడు.

అంతలో దొంగ కత్తిని నాన్నకేసి చూపుతూ - "డబ్బెక్కడ పెట్టావ్? యింత కొంపున్నోళ్ళ దగ్గిర డబ్బెందుకుండదు? సెప్తావా లేదా? ఊఁ!" - అన్నాడు.

ఈసారి నాన్నకు కోపం వచ్చినట్టు కనబడింది.

"నా దగ్గిర డబ్బేమీ లేదు. నా జీవితంలో అబద్ధం ఆడి ఎరగను. పనికొస్తవనుకుంటే ఆ చెంబులూ, గ్లాసులూ ఎత్తుకుపో. ఊరికే నోరు పారేసుకోవాక!" - అన్నాడు నాన్న.

"అంతా చత్త, హుఁ!" - అన్నాడు దొంగ.

నేను సరాసరి గదిలోకి వెళ్ళి నా పుస్తకాల పెట్టెలో అట్టడుగున వున్న వెండిగ్లాసు బయటికి తీశాను.

అమ్మ కాపురానికి వచ్చిన నెల రోజులకు - అమ్మ కోసం నాన్న ఈ గ్లాసు కొనుక్కొచ్చాడట.

"వెండిగ్లాసు నీ కోసమే కొనుక్కొచ్చాను. బావుందా? అంటూ మీ అమ్మ చేతికి గ్లాసు యిచ్చినప్పుడు - మీ అమ్మ నా మొహంలోకి ఎలా చూసిందో ఇప్పుడు నేను చెప్పలేను. మీ అమ్మ దేవత!" - అని ఓమారు నాన్న నాతో చెప్పాడు.

అమ్మ జ్ఞాపకంగా నాన్నకూ, నాకూ ఆ వెండి గ్లాసు మిగిలిపోయింది. నాలుగు నెల్లకూ మూడు నెల్లకోమారు -

"మీ అమ్మ వెండిగ్లాసు ఓమారు ఇటు తేమ్మా!" - అని నాన్న నన్నడిగేవాడు.

గ్లాసు చేతిలోకి తీసుకుని అటూ ఇటూ తిప్పిచూసి కళ్ళల్లో నీళ్లు నింపుకునేవాడు. తరవాత నేను చూసిపోయానేమో అని కళ్ళు తుడుచుకుంటూ -

"గ్లాసు దాయమ్మా! జాగ్రత్త!" - అంటూ నా చేతికి ఇచ్చేవాడు.

అలాంటి వెండిగ్లాసును - నాన్నకూ నాక్కూడా అమ్మ జ్ఞాపకచిహ్నంగా మిగిలిపోయిన వెండిగ్లాసును, దొంగ కిచ్చేందుకు తీసుకుని బయలుదేరాను.

నా చేతిలో వెండిగ్లాసు చూస్తూనే నాన్న విస్తుపోయాడు.

దొంగాడు కళ్ళింత చేసుకుని చూస్తున్నాడు.

నేను నిర్భయంగా దొంగాడి ముందుకెళ్ళి -

"ఇదుగో వెండిగ్లాసు! తీసుకుపో. చింపిరి గుడ్డలూ, దొంగ వెండీ, పాడు కొంపా అని ఇక వాగావా - డొక్క చీరేస్తాను!" - అన్నాను కోపంగా.

నా ధైర్యానికి నాన్న ఆశ్చర్యపోయినట్టు కనబడ్డాడు.

"మీ అయ్య కంటే నువ్వే గుండెకాయ వున్నదాన్లా వున్నావే! భలే అమ్మాయివి! పెంచుకుంటాను - వస్తావా?" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

నాన్న మాత్రం నోరు మెదపకుండా గ్లాసుకేసే చూస్తున్నాడు.

దొంగాడు గ్లాసును అటూ యిటూ తిప్పిచూసి, చప్పరిస్తూ -

"ఇదీ దొంగెండిదే! ఎదవ కొంప! అంతా చత్త!" - అనేశాడు.

నాన్న ఆ మాటలు వింటూనే లేచి నిలబడ్డాడు. మొహం కోపంతో కందగడ్డలా అయింది. గుప్పెళ్ళు బిగబట్టి పళ్ళు కొరుకుతూ -

"నువ్వో కసాయివి! ఏనాటి పాపమో నిన్ను కట్టి కుడుపుతోంది. జీవితంలో సంసార సుఖం, ఆనందం లాంటివి, ఏనాడూ నీకు అనుభవం అయివుండవు. నీ బ్రతుకింతే - నికృష్టపు బ్రతుకు, కనాకష్ట చావూ! నీ క్కావలిసిందేమిటో దొంగలించుకు పో! రామ్మా, రా!" - అంటూ నా చేయి పట్టుకుని గిరుక్కున గది వైపుకు దారితీశాడు.

దొంగ నాన్న మాటలు విని నివ్వెరపోయాడు.

చేతిలో కత్తి వణకటం నాకు కనిపించింది. గొంతు వరకూ వచ్చిన ఏడుపును అక్కడే బిగపట్టి వుంచేందుకు వుక్కిరిబిక్కిరైనట్టు నాకు తోచింది. గుడ్డిగా వెలుగుతూన్న దీపపు కాంతిలో, వాడి కళ్ళల్లో నీటి బిందువులు కదిలినట్టు నాకు అవగతమైంది.

కాని వాడు ముక్కు పుటాలు బిగించి - అంతలోనే కళ్ళల్లోకి నిప్పులు తెచ్చుకున్నాడు.

"గోల సేశావా పేణం తీస్తాను! ఆళ్లీళ్లు వచ్చేలోపలే అంతా అయిపోద్ది. నోరెత్తమాక!" - అన్నాడు.

"ఏడ్చావ్! నీ చావు నువ్వు చావు. పో!" - అంటూ నాన్న నా చేయి పట్టుకుని గదిలోకి వచ్చేశాడు.

మేం గదిలోకి వచ్చిన కాసేపటికి దొంగ తిట్టుకుంటూ కాసేపు అటూ ఇటూ తిరిగి బయటికి వెళ్ళిపోయాడు.

నాన్న, నన్ను పడుకోపెట్టి దుప్పటి కప్పాడు.

"నే వెళ్ళి పడుకుంటాను. నువ్వు నిదరపోమ్మా!" - అన్నాడు.

"ఈ దొంగాడికి డబ్బులూ, వెండి గ్లాసులు తప్ప మరేం పనికిరావా నాన్నా! చెంబులూ, తప్పేళాలైనా ఎత్తుకపోకూడదా?" - అని అడిగాను.

"వాడెవడో ఘరానా దొంగలా వున్నాడు. ముందు నువ్వు నిదరపో. వాడి సంగతి మనకెందుకు?" - అన్నాడు నాన్న.

నేను కళ్ళు మూసుకుని కాసేపటికల్లా గాఢనిద్రలోకి జారుకున్నాను.

తెల్లవారి లేచిచూసేసరికి దొంగ చెల్లాచెదురుగా పడవేసిన సామానంతా యెక్కడిదక్కడ చక్కగా సర్దివుంది. ఆ వెండిగ్లాసు మాత్రం ఆ ప్రాంతంలో ఎక్కడా కనబడలేదు. దొంగ ఎత్తుకపొయ్యాడులే అనుకున్నాను.

కాని, నాన్న ఆ దొంగతో అది మంచి వెండిగ్లాసే అని ఎందుకు చెప్పలేదు? నాన్న అబద్దాలకోరా అనిపించింది నాకు.

నాన్న పిరికివాడు కాదనేది నాకు ఎప్పుడో తెలిసిపోయింది. ఊళ్ళో వాళ్లు మాత్రం నాన్నని

పిరికిపంద కిందే జమకట్టారు. జీవరహితమైన పుస్తకాన్ని చదివి అర్థంచేసుకునేంతపాటైనా - సజీవ మానవుణ్ణి అర్థంచేసుకోలేమేమో అనుకుంటుంటాను.

నాన్న గతించాడు.

ఈ వారం రోజుల్లో అత్త ఇంట్లో తిరుగుతూంటే నాన్న రూపం నా కళ్ళల్లో మెదిలినట్టయింది. అత్త నాన్న కన్న రెండేళ్లే చిన్నది. ఆ ఆకృతుల్లో మామూలు మాటలకూ, దృష్టికీ అందని సామీప్యతా, సన్నిహితత్వం నాకు కనబడుతుంది.

పెట్టే బేడా సర్ది, ఇల్లంతా శుభ్రపరిచే ప్రయత్నంలో వుండగా, ఆ వెండిగ్లాసు మొట్టమొదటగా అత్త కంట బడింది.

"ఈ వెండిగ్లాసు మీ అమ్మకు అన్నయ్య పెళ్ళయిన కొత్తలో కొన్నదే గదా?" - అని అడిగింది అత్త.

"అవును!" - అన్నాను.

అంతకన్న నేనేం చెప్పగలను!

ఆ రోజున నాన్న ఆ వెండిగ్లాసు సంగతి గట్టిగా దొంగతో ఎందుకు చెప్పలేకపోయాడో ఇప్పుడు నా కర్థమవుతోంది.

అది అమ్మ విడిచిపోయిన ఒకే ఒక జ్ఞాపక చిహ్నం. అమ్మా-నాన్న ఎంత ప్రేమమయ జీవితాన్ని గడిపారో నాకు తెలియచెప్పేందుకు మిగిలివున్న మూగజీవి ఆ వెండిగ్లాసు.

కాని...నాన్న అబద్ధం అడాడు!

❀ ❀ ❀

శూన్యంగా ఆకాశం కేసి చూస్తున్నాను.

చివికి జీర్ణించిన మసి పాతలా వుంది ఆకాశం. అక్కడా యిక్కడా కుములుతున్న నిప్పుకణాల్లా నక్షత్రాలు రెప్పలు అల్లల్లాడిస్తున్నై.

"ఒంటరి దానిని.... లంకంత యిల్లు... వయసూ ఆనందం..."

అత్త మాటలు నా మనస్సులో రాపాడుతున్నయ్.

లంకంత ఇల్లుగదా అని రావణాసురుణ్ణి తెచ్చుకోగలనా?

నాన్నలో వున్న శాంతం, దయా, సానుభూతుల్లాంటివి వున్నవాడెవడైనా నాకీ జీవితంలో తటస్థపడతాడా?

చిటపటమంటూ వాన చినుకులు.

కిటికీ రెక్కల్ని కిర్రుమనిపిస్తూ విసురు గాలి.

కిటికీ రెక్కలు మూసి మంచం మీద నడుం వాల్చాను.

లంకంత యిల్లూ దీర్ఘనిద్రలో వున్నట్టు తోస్తోంది.

❀

*(ఆంధ్రజ్యోతి మాసపత్రిక : నవంబరు, 1953)*